# కారు మనదే.. సర్కారూ మనదే

- వారం రోజులు పనిచేయండి.. ఐదేళ్లు సేవ చేస్తా
- కొత్తపల్లిలో పాత ఇంటిపన్నులను పునరుద్ధరిస్తా
- 32 కేసులున్న రౌడీ షీటర్‌కు కాంగ్రెస్ టికెట్ ఇచ్చింది
- బండి సంజయ్ ఎంపీగా గెలిచినా ఒక్కసారైనా కనిపించిండా
- ఏ వ్యాపారం చేసి రూ.వందల కోట్లు సంపాదించిండు
- కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ ధ్వజం
- కొత్తపల్లిలో విస్తృత ప్రచారం
- బ్రహ్మరథం పట్టిన ప్రజలు



కొత్తపల్లి : ప్రచారంలో ఓటర్లకు నమస్కరిస్తున్న కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్

కొత్తపల్లి, నవంబర్ 22 : కారు మనదే.. సర్కారూ మనదేనని, సమైక్యపాలనలో నల్లముఖమైన కరీంనగర్‌ను తెల్లగా మార్చానని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. బుధవారం కొత్తపల్లి పట్టణంలో విస్తృతంగా ప్రచారం చేశారు. వాడ వాడకూ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా పట్టణవాసులు మంగళహారతులు, పూలమాలలతో మంత్రికి ఘనంగా స్వాగతం పలుకగా, ఆయా చోట్ల మంత్రి మాట్లాడారు. కరీంనగర్ గడ్డపై ఒకసారి గెలిచినవారు వరుసగా రెండోసారి గెలిచిన చరిత్ర లేదని, అలాంటిది తాను చేసిన అభివృద్ధిని గుర్తించిన కరీంనగర్ ప్రజలు వరుసగా రెండోసారి, మూడోసారి గెలిపించుకొని కుటుంబ సభ్యుడిగా ఆదరించారని గుర్తు చేశారు. కొత్తపల్లిలోని అన్ని వార్డుల్లో రోడ్లు వేశామని, అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు చెప్పారు. తాను చేసిన అభివృద్ధి ప్రజల కళ్లముందు ఉందని, దానిని గుర్తించి మరోసారి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తనపై పోటీలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థిపై 32 కేసులతో రౌడీషీట్ నమోదై ఉందని, కోట్లాది రూపాయలు తీసుకుని భూ కజ్జాదారుడికి ఆ పార్టీ టిక్కెట్ కేటాయించిందని, అలాంటి వ్యక్తికి ఓట్లు ఎలా పడుతాయని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మన భూములను, ఇళ్లను కబ్జా చేస్తాడని మండిపడ్డారు. నాడు కరీంనగర్ అసెంబ్లీ పరిధిలో ఓడి ఎంపీగా గెలిచిన బండి సంజయ్ ఆ తరువాత ఎప్పుడైనా కొత్తపల్లికి వచ్చి కనిపించాడా..? అని ప్రశ్నించారు. ఇక అభివృద్ధి ఎలా చేస్తాడో అర్థం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా కొనసాగిన కాలంలో టిక్కెట్లు అమ్ముకున్నాడనే ఆరోపణలతో పదవి నుంచి తొలగించారని విమర్శించారు. బీజేపీ నాయకులు ఓటుకు రూ 20వేలు, సెల్‌ఫోన్‌లు ఇస్తామని చెబుతున్నారని, బండి సంజయ్‌కు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఏం వ్యాపారం చేసి నాలుగేళ్లలో బండి సంజయ్ రూ.వందల కోట్లు ఎలా సంపాదించాడో చెప్పాలని డిమాండ్ చేశారు. తాను గెలిచిన తరువాత కొత్తపల్లి పట్టణంలో పాత ఇంటిపన్నును పునరుద్ధరిస్తానని హామీ ఇచ్చారు. కొత్తపల్లి అభివృద్ధి కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెడికల్ కళాశాలను పట్టణ పరిధిలో ఏర్పాటు చేశామని, అందులో ఉద్యోగాలను కొత్తపల్లి వాసులకే ఎక్కువ వచ్చేలా చూస్తానని భరోసా కల్పించారు. కరీంనగర్ మాదిరిగా రేకుర్తి నుంచి కొత్తపల్లి వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులు సాగుతున్నాయన్నారు. కాంగ్రెస్, బీజేపీ హైకమాండ్‌లు ఢిల్లీలో ఉంటాయని, వారు చెప్పిన ప్రకారమే ఇక్కడి నాయకులు నడుస్తారని చెప్పారు. తెలంగాణాలో హైకమాండ్ మన దగ్గరే ఉంటుందని, ఏం కావాలన్నా ఇక్కడే నిర్ణయాలు తీసుకోవచ్చన్నారు. తాను కౌన్సిలర్‌గా, ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నా కరీంనగర్ ప్రజలను విడిచిపోలేదని, నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కరెంట్, నీళ్ల కోసం పడ్డ కష్టాలు మళ్లీ రావద్దంటే బీఆర్ఎస్‌కే పట్టం కట్టాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో కొత్తపల్లి ప్రజలు వేల సంఖ్యలో హాజరై మంత్రి గంగులకు బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, మాజీ ఎంపీపీ వాసాల రమేశ్, మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ జమీలుద్దీన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, రైతు సమన్వయ సమితి నాయకులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



నుస్తులాపూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయిని భారీ గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

# ఏం చేయనోడే ఎగిరెగిరి పడుతుండు

- అట్లాంటోళ్లను నమ్మి ఆగం కావద్దు
- పోలింగ్ బూతుల్లోనే సమాధానం చెప్పాలి
- విజ్ఞానం లేని కాంగ్రెస్ నాయకులకు అసలే ఓటేయద్దు
- మానకొండూర్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- నుస్తులాపూర్, మొగిలిపాలెం గ్రామాల్లో ప్రచారం

తిమ్మాపూర్, నవంబర్ 22 : ఏ పనీ చేయనోడే ఎగిరెగిరి పడతున్నాడనీ, అట్లాంటోళ్లను నమ్మి ఆగం కావవద్దని మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సూచించారు. బూతులు మాట్లాడే నాయకుడికి పోలింగ్ బూత్‌లోనే ఓటర్లు సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. విజ్ఞానం లేని కాంగ్రెస్ నాయకులకు అసలే ఓటు వేయొద్దని కోరారు. ఈ మేరకు బుధవారం రాత్రి తిమ్మాపూర్ మండలంలోని నుస్తులాపూర్, మొగిలిపాలెం గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల ప్రసంగించారు. వ్యక్తిత్వం లేని నాయకులను దరికి రానీయొద్దన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో చంద్రబాబు బూటు కాళ్ల దగ్గర కుక్కలాగా పడి ఉన్న కవ్వంపల్లి సత్యనారాయణకు తనను విమర్శించే అర్హత లేదని హితవుపలికారు. గ్రామాలు కాంగ్రెస్ పాలనలో ఎట్లా ఉన్నాయో? తాను ఎంత అద్భుతంగా తీర్చిదిద్దామో కంటి వెలుగు అద్దాలు పెట్టుకొని చూడాలని సూచించారు. తాము వేసిన రోడ్లపై నిలబడే మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. గ్రామాల్లో కుల సంఘ భవనాలు అద్దాల్లా మెరుస్తున్నాయని, గ్రామ పంచాయతీ భవనాలు సచివాలయంలా కనిపిస్తున్నాయని చెప్పారు. తల్లిదండ్రులకు అన్నం పెట్టని కొడుకుల స్థానంలో కేసీఆర్ పెద్ద కొడుకు అయ్యారని, ఎంతోమంది అవ్వల ఆశీర్వాదాలు తమపై ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల మ్యానిఫెస్టోను వివరించారు. ఎమ్మెల్యే కాకముందే వాడు, వీడు అని సంభోదిస్తున్నాడని.. గెలిస్తే సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. గడపగడపకు అంటూ వస్తున్న కంచరపాలెం గ్యాంగ్‌ను నమ్మవద్దని సూచించారు. ఈ నెల 30న కారు గుర్తుపై ఓటు వేసి తనను మూడోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కోరారు. అంతకుముందు పూల వర్షం కురిపిస్తూ డప్పు చప్పుళ్లు కోలాటాల నృత్యాలు, బతుకమ్మలతో ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో నుస్తులాపూర్ సర్పంచ్, పార్టీ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకులు గడ్డం నాగరాజు, కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, కొత్త తిరుపతిరెడ్డి, పాశం అశోక్‌రెడ్డి, తిలక్, బేతి శ్రీనివాసరెడ్డి, వంతడుపుల సంపత్, వరుకోలు సమ్మయ్య పాల్గొన్నారు.



గోపాలరావుపేట ప్రచారంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

# ఊపిరి ఉన్నంత కాలం ప్రజల వెంటే..

**చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

చొప్పదండి (రామడుగు) నవంబర్22 : 'నా ఊపిరి ఉన్నంత కాలం ప్రజల వెంటే ఉంటా' అని చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్పష్టం చేశారు. బుధవారం రామడుగు మండలంలోని గోపాల్‌రావుపేటలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. అనంతరం గోపాల్‌రావుపేట బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన ప్రచార సభలో ఆయన మాట్లాడారు. తాను స్థానిక బిడ్డనని, అందుబాటులో ఉండి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నానని, ఆశీర్వదించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను చూసి మోసపోవద్దని సూచించారు. 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ఏమీ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇక్కడిలాంటి పథకాలు ఎందుకు లేవని ప్రశ్నించారు. గోపాల్‌రావుపేట ప్రజల చిరకాల వాంఛ అయిన మండల కేంద్రం ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రచారంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, కలిగేటి లక్ష్మణ్, నాగిశేఖర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు ఎడవల్లి నరేందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కోడూరి మణెమ్మ – మల్లేశం, కొండగట్టు డైరెక్టర్ దాసరి రాజేందర్‌రెడ్డి, ఎడవల్లి పాపిరెడ్డి, గ్రామ అధ్యక్షుడు వేల్పుల హరికృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కొలిపాక మల్లేశం మచ్చ గంగయ్య, మాజీ ఎంపీటీసీ దాసరి లక్ష్మి అరుణ్ కుమార్, మాజీ సర్పంచ్ నేరెళ్ల అంజయ్యగౌడ్, నాయకులు రేణికుంట బసంతం, పైండ్ల శ్రీనివాస్, రేణికుంట అశోక్, రాజిరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, సుద్దాల మల్లేశం, పురాణం రమేశ్, కొలిపాక మల్లయ్య, తిరుపతి, రఘు, దాసరి అనిల్, అల్వాల విష్ణు, అల్వాల శంకర్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బీజేపీని నమ్మితే నష్టపోతాం

- ప్రజా వ్యతిరేక పార్టీలకు గుణపాఠం చెప్పాలి
- బీఆర్ఎస్‌కే మద్దతు ఇవ్వాలి
- మీ బిడ్డగా ఆశీర్వదించండి..
- నియోజకవర్గాన్ని గొప్పగా తీర్చిదిద్దుతా
- బీఆర్ఎస్ హుజూరాబాద్ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి
- జమ్మికుంటలో ప్రచారం



ప్రచారంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, విప్ కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట, నవంబర్ 22 : కాంగ్రెస్, బీజేపీని నమ్మితే నష్టపోతామని, ప్రజా వ్యతిరేక పార్టీలకు ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సబ్బండ వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతున్న బీఆర్ఎస్‌కే మద్దతు ఇవ్వాలని కోరారు. బుధవారం ఆయన జమ్మికుంట మండలంలోని సైదాబాద్, సాయంత్రం మున్సిపల్ పరిధిలోని కృష్ణకాలనీ (26,27,28వ వార్డులు), శివాలయం ఏరియా(25, 30 వార్డులు), హుజూరాబాద్ రోడ్డు(6,7,21 వార్డులు), కొత్తపల్లి(4,5,17,18,19,20 వార్డులు)లో రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజల నుంచి ఘన స్వాగతం లభించింది. మహిళలు పూలు చల్లుతూ మంగళహారతులు పట్టి దీవించారు. జై తెలంగాణ.. జై కేసీఆర్.. జై కౌశికన్న.. అంటూ యువత నినదించారు. కౌశిక్‌రెడ్డి సతీమణి శాలినీరెడ్డి ప్రతి మహిళకూ బొట్టు పెట్టి, తన భర్తను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను నమ్మితే వ్యవసాయానికి మూడు గంటల కరెంటిస్తారని, మూడు గంటల కరెంటు రైతులకెట్లా సరిపోతదని ప్రశ్నించారు. 10 హెచ్‌పీ మోటర్లతో రైతులకు కలిగే ఇబ్బందులను వివరించారు. గతంలో కాంగ్రెస్ పెట్టిన కష్టాలను, ప్రస్తుతం కర్ణాటకలో చేస్తున్న ఇబ్బందులకు చెప్పారు. మూడు గంటల కరెంటు.. 24 గంటల విద్యుత్‌పై చర్చ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌వన్నీ ఉత్తుత్తి గ్యారెంటీలనని ఆరోపించారు. ఇక బీజేపీ రాష్ట్రంలో రాదని, ఉన్న మూడు సీట్లు కూడా గెలవలేని పార్టీ మ్యానిఫెస్టోలు విడుదల చేయడం హ్యాస్యాస్పదంగా ఉందన్నారు. రైతుల మోటర్లకు మీటర్లు పెట్టే బీజేపీ మనకు అవసరమా..? అని ప్రశ్నించారు. తనకు ఒక్కసారి అవకాశం ఇచ్చి చూడాలని, తన జీవితం ప్రజా సేవకే అంకితమని, ప్రజలే తన బలం, బలగమని స్పష్టం చేశారు. ఆయన వెంట డీసీసీబీ వైస్ చైర్మన్ పింగిళి రమేశ్, మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ దేశిని స్వప్న–కోటి, తదితరులు పాల్గొన్నారు.